మొగిలి పువ్వు

కాంపల్లి గౌరీశంకర్

ఆకాశం చీకటిని ప్రసవించి మత్తులో మునిగినవేళ —

అలవాటైన ఆ జీమూతంలోనుంచి అడుగులో అడుగువేసుకుంటూ నడిచి వచ్చింది ముత్యాలు. చప్పుడుచేయకుండా తలుపు తోసుకొని లోపలికివచ్చి, కిరసనాయిలు బుడ్డి దీపపు వత్తిని పైకితోసింది. కుక్కి మంచంలో నిద్రపోతున్న చంద్రాయ్ మొహం కనిపించేలా వెలుగు వ్యాపించింది. కిటికీ ఊచల సందుల్లోనుంచి లోపలికి ప్రవేశించిన గుడ్డివెన్నెల. దీపంకాంతితో కలిసి చీకటిమీద యుద్ధంచేస్తోంది. వెలుగును మింగాలని చీకటి. చీకటిని కబళించాలని వెలుగు ఈ యుగయుగాల చిరపోరాటంలో చీకటిదే పైచెయ్యవుతున్నది. చామనచాయ వెలుగులో చంద్రాయ్‌ని ఒక్కక్షణం పరికించింది ముత్యాలు.

నిర్మలంగాఉన్న నుదురు. బ్రతుకులోని నీడల్ని తెలియని మొహం. చిన్న నిశ్వాస చేసింది ముత్యాలు. ఆమె దృష్టి గోడ వైపుకు తిరిగింది.

గోడకు మధ్యగా అందంగా మొగిలి పువ్వు. దానిచుట్టూ కొంతదూరంలో వలయాకారంగా చిన్న చిన్న రెక్కల పురుగులు. ఆ వలయంలో కొంతభాగం ఖాళీగా తెల్లగాఉంది. తెల్లగా వెల్లవేసిన గోడ మీద పాపంలాంటి నల్లటి బొమ్మలు,

వికృతంగా, వికారంగా.

ముక్కోణాకారంగా ఉన్న గూట్లోంచి బొగ్గుముక్క తీసుకుని, ఖాళీగా ఉన్న వలయంలో మరో రెక్కల పురుగుని గీచింది ముత్యాలు. ఆ బొమ్మలవంక కాసేపు తదేకంగా చూసింది. వలయం రెండుకొసలూ దగ్గరవుతున్నాయి, జీవితానికున్న పరిధిలా.

చెంగునఉన్న డబ్బును తీసి, పెట్టె అడుగున ఉంచిన తర్వాత, దీపాన్ని తగ్గించి కటికనేలమీద చెంగుపరచుకుని పడుకుంది. కళ్లు మూసుకుంటే భయంకరమైన చీకటి. కంటికందని చీకటి. అందుకనే కళ్లు తెరుచుకుని కనిపించే చీకటినే చూస్తూ ఉండిపోయింది. ఈ చీకటి అంత భయంకరంగా లేదు. ముళ్చుకుంటున్న చీకటితోపాటు గతంకూడా గిర్రున తిరిగింది. మేలుకొనే పీడకల కంటోంది ముత్యాలు.

*   *   *

అమాయకత్వానికి పల్లెటూళ్లు ఆటపట్టని ప్రతీతి. ఆగ్రామంలో అది అన్నిచోట్లా నిండుకున్నా, రూపందాల్చి ముత్యాలుగా మారిందా అనిపించేది ఎవరికైనా ఆమెని చూస్తే.

బ్రహ్మ ఓ అందమైన బొమ్మను చేసి, నూరేళ్లమటుకే ఆయువు పోశాడు. అందుకే ముత్యాలు భూమికి జారింది. ఆ బొమ్మను సృష్టికర్త చిరాయువుగా చేసినట్లయితే, బహుశా ముత్యాలు దేవలోకంలో ఉండి ఉండేది.

బొమ్మలా ఉండే ముత్యాలుకు బొమ్మలు గీయడం వచ్చు. ఆమె బొమ్మలు జీవంతో కళకళలాడుతుంటాయి. అప్పుడే పుట్టిన వెన్నెల్నీ, ఆడుకుంటున్న పిల్లల్నీ, వెలుగులో తలలూపుతున్న మల్లెల్నీ, ఎన్నిటినో తనకు తనివితీరేలా చిత్రించుకొనేది. సౌందర్య చిత్రణకు అలవాటుపడ్డ ఆమె చేతులు, ఆమె జీవిత చిత్రాన్ని కూడా అందంగా మలచాయి. తల్లి పూజ చేసుకొనే ప్రదేశంలో గోడమీద గుర్రపు స్వారీ చేస్తున్న ఓ రాజకుమారుడి బొమ్మను గీచుకొంది. అతని కళ్లల్లో చిలిపితనాన్ని నింపింది. గుర్రం పక్కగా పూల హారంతో ఒక స్త్రీ బొమ్మను వేసి, ఆమె కళ్లల్లో ఆశను పోసింది. ఆ బొమ్మల్ని చూసుకొన్నప్పుడల్లా ముత్యాలుకు సంతోషం కలిగేది. వెంటనే సిగ్గు వేసేది. మాటల కందని భావాల్లో తలమునకలయేది. అప్పుడప్పుడు పూలహారంతో వున్న ఆ స్త్రీలో తన పోలికలు కనిపించేవి ముత్యాలుకు.

ముత్యాలు తల్లికి దైవ భక్తి హెచ్చు. కులంలో ఎవరికీ అలవాటు లేని పూజలూ పునస్కారాలూ గవరమ్మకు మెండు. అందువల్లనే అందరూ ఆమెను 'పుణ్యాత్మురాలు' అనుకొనేవారు. ఆ పేరును నిలుపుకోటానికేమో అన్నట్లుగా, మధ్య వయసు దాటకుండానే మరణించిందామె. తల్లి మరణంతో, తాగుడుతో యింటికి రాని తండ్రి ఒక్కడే మిగిలాడు ముత్యాలుకు. ఇప్పుడామెకు బొమ్మలు గీచుకొనే తీరిక లేదు. చూచుకొనే ఓపికా మిగల్లేదు. కళ్లల్లో వత్తులు వేసుకొని, తండ్రి రాక కోసం ఎదురు చూడటంతోనే ఆమె కాలమంతా గడిచిపోయేది. తన లోకంలో తన్మయత్వంలో మునిగిపోయే ముత్యాలును బాధ్యత బంధించి వేసింది.

కానీ ఎంతో కాలం గడవకుండానే ఆ బాధ్యతను తీసుకోటానికి వచ్చింది తల్లిలాంటి తల్లి. ఎప్పుడూ ఊరిని ఇంటిగా చేసుకొని తిరిగే పైడయ్య ఇంటి పట్టునే ఉండసాగాడు. జానమ్మను చూపించి, ముత్యాలుతో 'మీ అమ్మ' అని చెప్పాడు పైడయ్య. 'ఔను. అమ్మ' అనుకుంది ముత్యాలు. 'నీ కూతురు' అని ముత్యాలును జానమ్మకు చూపాడు పైడయ్య, అదే సమయంలో. ఎకసెక్కంగా నవ్వుకుంది జానమ్మ, తనకూ, తన 'కూతురి'కీ వయసులో కనిపించని తేడాని తలుచుకుని.

'మా అమ్మ' అనుకొంటూ యింట్లో సమస్త చాకిరీ చేసేది ముత్యాలు. 'మా అమ్మకగా' అనుకుంటూ పాలని కెళ్లి గొడ్లకు గడ్డి కోసుకొచ్చేది. 'అమ్మ కాకపోతే ఇంకెవరు చెప్తారు?' అనుకుంటూ పాలను ఊరంతా తిరిగి అమ్మేది. కానీ తన రాజకుమారుడి బొమ్మను జానమ్మ తుడిచి వేసినప్పుడు మాత్రమే 'ఆమె' తల్లికాదని తెలిసింది ముత్యాలుకు. ఖాళీ అయిన రాజకుమారుడిస్థానంలో, మరెవరి బొమ్మా గీచుకోదలచులేదు ముత్యాలు.

అందుకే రాములుతో తనకు మనువు నిశ్చయించారని విన్నప్పుడు జానమ్మముందు అవాక్కయి నిలుచుండిపోయింది ముత్యాలు. 'ఏం మాట్లాడవ్? రెండో పెళ్లివాడనా? మీ అయ్య నన్ను జేసుకున్నదిమాత్రం రెండో మనువుగాదూ? నోర్మూసుకుని బుద్ధిగా జేసుకో' అంటూ నెత్తిన రెండు మొట్టినప్పుడు కళ్లల్లోకి నీరు ఊరాయి ముత్యాలుకు. ఆ కన్నీళ్లలోనే రాములుతో పెళ్లి జరిగిపోయింది.

ఆ రాత్రి తల్లి పూజచేసుకొనేచోట నిలుచుని, అమ్మను తలుచుకొనీ, చెరిగిపోయిన రాజకుమారుడి బొమ్మను తలుచుకొనీ ఎంతోసేపు ఏడుస్తూ ఉండిపోయింది ముత్యాలు.

*   *   *

చంద్రాయ్ స్పర్శతో త్రుళ్లిపడింది ముత్యాలు.

గదినిండా వెలుగు ముడుగుకట్టింది. ఊరి రణగొణధ్వనులు చెవులకు సోకుతున్నాయి.

'ఏందమ్మా, నువ్వు నిద్రబోలా?'

'లేదురా. ఇప్పుడే లేగిశా' అంటూ కప్పిపుచ్చింది ముత్యాలు.

చంద్రాయ్ అన్నం అంటూ గోడమీద బొమ్మల్ని లెక్కపెడుతున్నాడు. ముత్యాలు మనసులో ఆలోచనలు వంశవృక్షాన్ని పెంచుకుంటున్నాయి.

'అమ్మోవ్. ముప్పయ్యారే. ఇయ్యాల్లో పురుగెక్కువుందే!' లెఖ్ఖ పూర్తిచేసిన చంద్రాయ్ హఠాత్తుగా అన్నాడు.

ముత్యాలు ఉలిక్కిపడింది. మొహం ఎర్రగా తయారయింది. నిద్రలేని కళ్లల్లో వేడి పొంగింది.

'అమ్మా, నీకు బోల్డన్ని మంచి బొమ్మలొచ్చుగదే. ఈపాడు పురుగుల బొమ్మలెయ్యొద్దే. అసయ్యంగుంటాయి...' చంద్రాయ్ చెయ్యి కదుక్కుంటూ అన్నాడు.

'పురుగులు అట్టాగే ఉంటాయిరా' అంది ముత్యాలు.

చంద్రాయ్‌ని బడికి పంపిన తర్వాత, తను కరణంగారింటికి బయలుదేరింది ముత్యాలు.

'అమ్మగోరూ...' ముత్యాలు కేకకు కమలమ్మ బయటికొచ్చి ముత్యాలును చూసింది. ఎండలో మెరుస్తోంది ముత్యాలు ఒళ్లు. ఒంటిమీద మాసినబట్ట వెలాతెలాపోతున్నది. కమలమ్మ తన శరీరం వైపు చూసుకుంది. జిగి బిగీ లేని ఒళ్లు వెక్కిరించింది. కట్టుకున్న జరీ చీరె మాత్రం ఎండలో తళతళమంటూంది.

మొగిలిపువ్వు

మౌనంగా లోపలికెళ్ళి, చెంబులూ, అంట్లగిన్నెలూ తెచ్చి ముత్యాలు ముందు పడేసింది. వాటిని కడుగుతుంటే ముత్యాలుకు హఠాత్తుగా ఆ మాటలు గుర్తుకొచ్చాయి.

*　　*　　*

'సిలుము పాత్ర కంటుకున్న సింతపండువే నువ్వు' తనని దగ్గరకు తీసుకుంటూ రాములన్న మాటలకు అర్థం తెలీలేదు ఆ మొదటి రాత్రి.

'పిచ్చిదానా, ఇప్పటిదాకా ఇట్టం వొచ్చి నట్టు తిరిగాను. ఆ సిలుమును నువు కడగాల ముత్తెం!' తనని మాట్లాడనీయకుండా గుండెల్లో ఉంచుకున్నాడు రాములు.

అమ్మతోపాటే పోయిన సుఖం తిరిగొస్తుందనుకోలేదు ముత్యాలు. 'కాసీ పట్టు సడలని చేతుల్లో' తనని రాములు పెనవేసుకున్నప్పుడు, ఆప్యాయమైన మాటలతో తనను ఊరడించినప్పుడు, అపకారంలోనే ఓ దోవ చూపించిన జానమ్మకు మనసులోనే దణ్ణం పెట్టుకుంది ముత్యాలు. ఆ సుఖం మిగిలిన జీవితమంతా ఉంచమని, కనిపించని ఎందరి దేవుళ్ళనో అర్థించింది.

తన ఉనికిని ఎప్పుడూ మరవకుండా చేయాలంటే, మనుషులు కోరిన కోరికల్ని తీర్చకుండా ఉండటమొక్కటే ఆ దైవానికున్న మార్గం. అందుకే రాములు, చిట్టిని తీసుకుని ఊరొదిలి లేచిపోయినప్పుడు, దేవుణ్ణి తలుచుకుంది ముత్యాలు — అసహ్యంతోనే అయినా.

తన ఒంటినున్న నగలన్నీ రాములు వలుచుకు పోయినందుకు బాధపడలేదు ముత్యాలు. వాటికి బదులుగా తన రూపాన్ని ముత్యాలులో మిగిల్చిపోయాడు. అదే భాగ్యమనుకొంది ఆమె. కానీ అది తన దౌర్భాగ్యంగా పరిణమిస్తుందని పుట్టింటికి వెళ్ళేదాకా తెలీలేదు ఆమెకి. తండ్రి లేకపోయినా సవతి తల్లే అయినా, ఆమెదీ ఆడమనసే. తన స్థితి చూసి కరగక పోతుందా అనుకుంది ముత్యాలు.

కానీ 'ఒక్కదానివిగా ఎళ్ళి, ఇద్దరుగా వచ్చావా? అయినా మొగుడు దేశాలు పట్టింతర్వాత, నీకు కడుపెట్టాగయిందే?' అన్న జానమ్మ మాటలతో, ముత్యాలు ఆమెని గురించి అనుకున్నది మళ్ళీ అబద్ధమయింది. జానమ్మ నిఖార్సయిన సవతి తల్లి అని తేల్చుకున్న తర్వాత, ఆమె మాటల అగ్గిలో బడి, అపవాదులు పులుముకుని, బాడిద కాదల్చుకోలేదు ఆమె.

భవిష్యత్తును తన శక్తి సామర్థ్యాల కప్పగించి, జీవితంతో పోరాడ్డానికి నిశ్చయించుకుంది.

*　　*　　*

పగలు మొలిచిన చుక్కలా వెలిగిపోతున్నది ముత్యాలు ఎండలో.

'ముత్యాలూ...'

తలెత్తి చూసింది గుమ్మాని కానుకుని తనవంక చూస్తున్న కరణంగారు.

'ఏం బాబుగోరూ...'

'సాయంకాలం అట్లా ఓసారి కొబ్బరి తోట దగ్గరకు రా. మొక్కలకి పాదులు తీయాలి' వెలుపలికొచ్చిన కమలమ్మను చూస్తూ అన్నాడు వెంకట్రామయ్య.

కడిగిన పాత్రల్ని 'ఖణేల్' మంటూ మోగిస్తూ లోపలికి తీసుకెళ్ళింది కమలమ్మ.

ఆవిడ వెళ్ళిన తర్వాత ముత్యాలు లేచి వెంకట్రామయ్యని సమీపించింది.

'అట్టాగే బాబుగోరూ' అంది. ఆమె మొహంలోకి రక్తం ప్రవహించింది.

చీరెకొంగు కొనలు ముడేసుకుంటూ వెళ్ళిపోతున్న ముత్యాలును, తలుపు వారగా నిలబడి చూస్తూ ఉండిపోయింది కమలమ్మ.

*　　*　　*

కొలిమిలో కాలి చల్లబడ్డ బంగారంలా నీరెండకాంతుల్ని పరుస్తున్నాడు భానుడు.

తోటవైపుగా నడుస్తున్న ముత్యాలు కంటిముందు ఏవేవో అదృశ్య చిత్రాలు మెదలుతున్నాయి.

పెద్దకాపుగారబ్బాయిలాగా పట్నంలో చదువుకుంటున్నాడు చంద్రయ్. పెద్ద చదువు, తన ఊహాకందని చదువు కష్టాలకు దూరంగా, కల్మషానికి అతీతంగా, కన్నతల్లి ఆశలకు రెక్కలిస్తున్న చదువు. జవసత్వాలుడిగిన దేహంతో, కళ్ళల్లో సమాధి అయిపోయిన కాంతిని పుంజుకుంటూ ఎదురు చూస్తున్నదామె. తెల్లటి వస్త్రాలతో, చల్లటి చిరునవ్వుతో 'మన కట్టాలు తీరిపోయాయి. పదమ్మా, ఈ ఊరిడిసి ఎళ్ళిపోదాం' అంటున్నాడు వాడు. కాలుపెట్టి మెట్టిన ఊరినీ, జీవితవుగట్టు తెంపిన ఊరినీ విడిచి రాలేకపోతోంది తను. 'నన్నిక్కడే పిడికెడు మట్టి కానియ్యరా. నువ్వెళ్ళి సుకపడరా నా తండ్రీ!' అంటే వినడం లేదతడు. కొడుక్కి దూరం కాలేకా, అతని నిర్మల జీవితానికి భారం కాలేకా బాధతో తపిస్తోందామె.

ఆలోచనల్లో ఈదుతోన్న ఆమె మనస్సు కాలికి కొట్టుకున్న ఎదురు రాయితో జాగ్రదావస్థలోకి వచ్చింది. బొటనవేలి నుంచి ప్రవహిస్తున్న ఎరుపును చూస్తూ కళ్ళు తుడుచుకుంది ఆమె. 'నా కల కరిగిపోనీకు



దేవుడా, పన్నన్యాయం సెయ్యకురా కసాయోడా' వళ్లు కొరుక్కుంటూ అనుకుంది ముత్యాలు.

ఆలోచనరిచ్చిన బలంతో మందగించిన తత్తరపాటునడక వేగాన్నందుకుంది. తోట చేరుకునే వేళకు, అప్పటికే మరో ఏడెనిమిది మంది చెట్లకు పాదులు చేస్తున్నారు. వెంకట్రామయ్య పలకరింపుగా నవ్వాడు. బదులిచ్చి, తనూ ఓ గడ్డపలుగుపుచ్చుకుని, నేలను త్రవ్వటం ప్రారంభించింది.

ఆకాశం నుదుటి కుంకుమ చెరిగిపోవడంతో, క్రమంగా వైధవ్యంలాంటి చీకటి నలుమూలలా అలుముకోసాగింది.

నిటారుగా పెరిగి ఒంగిపోయిన చెట్టు బోదెనానుకుని, ఆ వొంపుని చూస్తూ ఉండిపోయింది ముత్యాలు. ఏతాం తోడుతున్న చప్పుడు, తోటపనివాళ్ల కబుర్ల శబ్దాలు, కొబ్బరిచెట్లు అందిస్తున్న ఈల పాటలూ అస్పష్టంగా చెవులకు సోకుతున్నాయామెకు.

దగ్గరలో అడుగుల చప్పుడు వినపడటంతో త్రుళ్లిపడింది ముత్యాలు. ఎదురుగా నిలబడి, మసకగా కనిపిస్తున్న ఆకారాన్ని చూడగనే జుగుప్స ఆశ్చర్యంగా మారింది ముత్యాలులో.

'అమ్మగోరూ ...' అంది మాట తడబడింది. కమలమ్మ ముత్యాలుకు దగ్గరగా వచ్చింది 'ఇదుగో, ఇది తీసుకో. రేపటి నుంచి ఇంటికిరాకు' రహస్యంగా అని, వచ్చి

ముగిలిపువ్వు

నట్లుగానే సద్దులేకుండా వెళ్లిపోయిందామె.

ముత్యాలు చేతుల్లో నోట్లు పైరు గాలికి ఎగురుతున్నాయి. నాటివంక విప్పారిన కళ్లతో చూస్తోంది ముత్యాలు. ఆమె మనసులో ఆలోచలు.

చంద్రాయ్ ఆకలితో అల్లాడిపోతున్నప్పుడు, ఇళ్లిళ్లూ తిరిగి కండల్ని కరిగించైనా వాటి నోటికి తిండి అందిద్దామనుకుంది తను. తనకండలు కరిగాయి. తన బిడ్డకు సంతృప్తి కలిగింది. కానీ తనలో మటుకు అసంతృప్తి మిగిలిపోయింది.

అలోలక్ష్మణా అని అల్లాడినప్పుడు తననీ ఏ తల్లీ కరుణించలేదు. ఏ వ్యక్తీ తనకు బొత్తులు బొత్తులుగా డబ్బందించలేదు సరికదా, మొండి చేత్తో చిల్లు దమ్మిడీ విదల్చలేదు.

'నీకు నేనండగా ఉంటాను.' అని చనిపోయిన తల్లిగానీ, బతికి ఉన్న సవతితల్లిగానీ, కనిపించని దేముడుగానీ, స్వార్థం కోసం సహాయం చేసే ఊళ్లోని ఏ ధర్మాత్ములుగానీ, వోరారా అనలేదు. కడుపు చేత బట్టుకుని పనిపాటులకై ఇంట్లోకొచ్చి, ఒంటరితనంలో మనసబు అపహాస్యానికి గురైనప్పుడు, తెలిసీ తన బ్రతుకుకు ఆదుకుంటానని అభయం ఇవ్వలేని ఈలోకం, తనకీనాడు అవసరానికి మించి సహాయ పడటానికి ముందుకొస్తోంది. అత్తిపండులాంటి లోకం ఇది. స్వార్థంలో పుట్టిన కరుణ దానిది.

ఆనాడే చద్దామనుకుంది తను. బ్రతుకుదామని అనుకోవడం కంటే బ్రతకడం కష్టమని తెలిసినప్పుడు కలిగిన తలపు అది. క్షణక్షణం చావుని భరించలేక చేసుకున్న నిర్ణయమది. ఈ భూమికి తన బరువు తగ్గించాలనుకుంది. కానీ కడుపులో బరువు వెక్కిరించింది.

కంచె మేసిన జీవితం తనది. తన బిడ్డ కళ్ళు తెరవకముందే ఆ దురదృష్టానికి బలి కాకూడదు. లోకం వినాడ వగతీర్చుకోవాలి. వాడు దాని క్రూరత్వానికి బలి కాకుండా, ఎదురు తిరిగి దాన్ని చూసి నవ్వాలి. తనను తనివితీరా నవ్వించాలి — తన జీవితం పణమైనాసరే!

ఆనాడే తెల్లటి గోడమీద మంబొగ్గుతో బొమ్మలు గీచుకుంది, మొదటిసారిగా.

* * *

'ముత్యాలూ...' కేక పెద్దగా వినిపించింది ఆలోచనల్లోంచి తేరుకుని, ఆ పిలుపుని పట్టించుకోకుండా తోటదాటి ఊరివైపు నడిచింది ముత్యాలు.

వెనక పిలుపు ఇంకా వినిపిస్తూనే ఉంది.

* * *

చంద్రాయ్ ఇంకా మేలుకొనే ఉన్నాడు. తల్లిని చూడగానే వాడి మొహం వికసించింది.

'ఏడకు బోయ్యావే' ముత్యాలును చుట్టేసుకున్నాడు వాడు. చంద్రాయ్‌ని గుండెలకు గట్టిగా హత్తుకొని కాసేపలాగే ఉండిపోయింది ముత్యాలు. గండిపడ్డ చెరువులా హృదయం విచ్చుకుంది. ప్రేమ పెల్లుబికింది.

అన్నం తిని, అమాయకంగా నిద్రపోతున్న కొడుకుని చూస్తుంటే, వాడి మాటలు మనసులో మెదిలాయి.

'ఈ పురుగుల బొమ్మలెయ్యొద్దే, పాడు అసయ్యం గుంటాయి...'

తరిగిపోయిన చవితి చంద్రుణ్ణి మేఘాలు ఇంకా కప్పేస్తున్నాయి. ముత్యాలు మొహం మీద వెలుగు నీడలు పరుచుకొంటున్నాయి.

'పురుగుల బొమ్మలు, అసయ్యం—' పదే పదే గుర్తుకొస్తున్నాయా మాటలు.

'ఏ కెట్టా సెప్పేదిరా నాయనా! నేను



గసిన పిచ్చిగీతలు కావురా అవి. బగమంతుడు రాసిన శుండాలప్పు రాతలు'

నిప్పును కప్పిన నివురు ఎగిరిపోయి, ముత్యాలు గుండె కణకణం మండసాగింది. కణ కణ కాలిపోతున్నది.

రోజూ అనుభవమయ్యే బాధే ఆమెకది. జీవిత నావను ముంచేస్తున్న ఆ తుఫాను నుంచి తప్పించుకోవాలని ఎన్నోసార్లు అనుకున్నా ఆమె అలాచేయలేక పోతోంది. పెనుగాలిని తప్పించుకున్నా, మిగిలేది కటిక చీకటేనని ఆమెకు తెలుసు. అగాధ తిమిరంలో తను నమ్ముకున్న కొయ్యముక్క చేజారిపోతుంది. అలలకు తగిలి, చిన్నా భిన్నమై సముద్రగర్భంలో కలిసిపోతుంది! ఆ సాహసం ఆమెకులేదు. అందుకే భయంకరమైనా, తుఫాన్ నే కోరుకుంటోంది ఆమె మనసు.

ఆరోజు ఆమె మనస్సు, ఎన్నడూ లేనట్లుగా అల్లకల్లోలమై పోయింది. ఏదో భీతి, ఏమిటో అనుభూతి ఆమెను ముట్టేశాయి. కంటిముందు దృశ్యాలు మసక బారుతున్నాయి. నిర్జీవ ప్రతిమలా కూచుండి పోయింది.

ఒక రాత్రివేళ తలుపులు 'కిర్రు' మని తెరుచుకున్న శబ్దం, పరిచయంలేని అడుగుల చప్పుడు.

భ్రమేమో అనుకుంది. కాదు నిజంగానే ఎవరో సమీపిస్తున్నారు. ఆశ్చర్య పడిందామె భయం వెయ్యలేదు.

'ఎవరు?' కీచుగొంతుకతో అంటూ దీపపు వత్తిని పైకెగదోసింది. వెలుగు వాకిలికి పాకింది.

ముత్యాలు స్తంభించి పోయింది.

ఎదురుగా రాములు!!

అతని కళ్లల్లో వెలుతురు. ఆ వెలుతురులో ఆశ, పశ్చాత్తాపం, ప్రేమ, ఇంకా ఏమిటో తెలీని భావాలు పెనవేసుకుని ఇంద్రచాపంలా మెరుస్తున్నాయి. ఆమె కళ్లల్లో సంకోచం, భయం, చాంచల్యం కారు మొయిలులా కమ్మి తొలిచేస్తున్నాయి.

'ముత్తెం—' ఎన్నాళ్ల క్రితమో విని పించటం మానేసిన, ఇక ఎన్నాళ్లకూ వినిపించదని ముత్యాలు అనుకున్న పిలుపు, తియ్యగా వినిపిస్తోంది. పిడుగులా దహిస్తోంది.

ఆమె పలికేటంతలో, రాములు ఆమెని గాఢంగా కౌగలించుకున్నాడు.

రాములు కళ్ళలోంచి పన్నీరు స్రవిస్తోంది. ముత్యాలు కంట్లోంచి కన్నీరు ఉరుకుతోంది. అది, సప్తసాగరాలూ పొంగి జలప్రళయం వచ్చిన సమయం. క్షీరసాగర మథనంలో కాలకూటం చిమ్మిన క్షణం.

ఆ సంక్షోభం ముగిసిన తర్వాత, అమృతంలా నవ్వింది ముత్యాలు. మనసారా, తనివి తీరా, గుండెల లోతుల్లోనుంచి వెలువడ్డ నవ్వది.

'ఇన్నాళ్లకు దయగలిగిందా మావా…!' ముత్యాలు గొంతు బొంగురుపోయింది. ఆ మాటల్లో 'ఎన్నాళ్ళకొచ్చా'వన్న నిష్ఠూరం 'కొన్నాళ్లు ముందుగావస్తే ఎంత బాగుండేది' అన్న తహతహ. బీడుగా మారిన భూమిమీద కురిసిన వానను తలుచుకుని తపన.

ఆప్యాయంగా ముత్యాలు కలిపి నోటికి ముద్దలందిస్తూంటే, ఆ పురాపురుమని తింటూ రాములు కబుర్లు చెప్తున్నాడు, తనకు జీవితంలో ఏది కావాలనుకున్నాడో, తనకు జీవితం ఏమిచ్చిందో కష్టపెయ్యని ఒదిలేసి తనవెంట లేచొచ్చిన చిట్టి, తన నొదిలి ఎట్లా లేచిపోయిందో, అప్పటికి తనకు కావలసినదేమిటో తెలియక దేశాలు పట్టుకు ఎలా తిరిగాడో చెప్పుకు పోతున్నాడు. సిగ్గులేకుండా, నిష్కల్మషంగా.

'నువ్వులేనిచోట నాకేంలేదని తెలిసిం తర్వాత తిరిగొచ్చానే ముత్తెం' అంటున్నప్పుడు రాములు కళ్లు చెమ్మగిల్లాయి.

'ఛ, ఏడుస్తుండావా ఆడదానిలాగా. ఊరుకో మావా…నా దగ్గరికొచ్చేశావుగా. ఇంకేడకీ పోమాకు, నాకు నువ్వూ. నీకు నేనూ…' రాములు నోదారుస్తోంది. తనను ఓదార్చుకోవడం తెలీని ముత్యాలు.

'సూడు, నువ్వు వన్నొదిలి పోయిం తర్వాత పుట్టిన నీ బిడ్డ ఎంతోడయ్యాడో…' చంద్రాయ్‌ని చూపించింది.

వంగి, నిద్రపోతున్న చంద్రాయ్ తల మీద ముద్దు పెట్టుకున్నాడు రాములు.

ముత్యాలు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయింది. నెమలిలా పురివిప్పుకున్న మన

మ్పుతో, ఒళ్లంతా కళ్లు చేసుకుని ఆ దృశ్యాన్ని చూసింది. ఒక్కసారిగా మావ కాళ్లకు చుట్టేసుకుపోవాలనుకుంది 'నామీద ఈ పాపిష్టిలోకానికి కలగని నమ్మకం నీక్కలిగిందా మావా...' అని చెప్పాలనుకుంది. కాని గొంతు పూడుకుపోయింది.

అదురుతున్న పెదాలతో 'మావా' అని మాత్రం అనగలిగింది.

ఓ క్షణం అచేతనమై పోయిన ముత్యాలు, రాములు మాటలతో అదిరి పడింది.

'ముత్తెం, గోడమీద ఆ పిచ్చిబొమ్మలేంటే, ఏ సీతారాముల్నో గీసుకోక' గోడమీది బొమ్మల్ని అయోమయంగా చూస్తూ రాములంటూంటే, ముత్యాలు తడబాటు పడింది.

'ఏం లేదులే మావా పొద్దుపోయింది రేపు మాట్లాడుకుందాంలే, పడుకో—' మాట తప్పిస్తూ అన్నది.

రాములింకేమీ అడగలేదు. ఏళ్ల తర్వాత తిరిగొచ్చిన ఆ రాత్రిని వృథా చెయ్యదల్చుకోలేదతను. ముత్యాలును పొదివి పట్టుకుని దగ్గరకు లాక్కుంటున్నాడు.

చలించి పోతున్న తనువునీ, మనసునీ బిగించి పట్టుకోవడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తోంది ముత్యాలు.

'ముత్తెం,' ఇన్నేళ్లు గడిచినా ఇంకా పువ్వులాగానే ఉండావే' రాములులో ఆవేశం పెరిగి పోతోంది.

ముత్యాలు మనసులో నిప్పు రవ్వలు రేగుతున్నాయి.

'మొగిలిపువ్వును మావా—విన్నంటలేను' అని చెప్దామనుకుంది. మాటలు గొంతులోనే కొట్టుకులాడుతున్నాయి.

ప్రయత్నం మీద విడిపించుకుంటూ, 'పడుకోమావా, ఇయాల ముక్కురోరం.' అన్నది.

రాములు గాఢనిద్రలో మునిగిపోయిన తర్వాత, తూలుతూ లేచి గోడ దగ్గరికి నడిచింది ముత్యాలు.

గోడమీద వలయాకారంగా బొగ్గుతో గీచిన రెక్కల పురుగులు. భయంకరంగా, వల్లగా, అసహ్యంగా ఎగురుతున్నాయి. మధ్యగా మొగిలి పువ్వు నీరసంగా నవ్వుతోంది.

గూట్లోంచి బొగ్గు తీసుకుని, ముత్యాలు ఆ మొగిలిపువ్వు పక్కగా ఓ తుమ్మెదని గీచింది. అందమైన రెక్కలతో, ఠీవిగా, అధికారంతో ఎగురుతున్న తుమ్మెద పువ్వుని తమ నీడకింద కప్పేసేటంత పెద్ద రెక్కల భ్రమరం !

ఎదురుగా రెక్కల పురుగులు నవ్వుతున్నాయి, పరిహాసంగా. కసిగా వాటినన్నిటినీ గోడమీద నుంచి చెరిపేసింది ముత్యాలు. అవి చెరిగిపోయిన ప్రదేశంలో గుండ్రంగా నల్లటి మచ్చలేర్పడ్డాయి.

అసహనంగా నిల్చుండిపోయింది ముత్యాలు. కళ్లు నీళ్లతో నిండిపోయాయి. ఆవేశంగా ఆ మరకల్ని మళ్లీ మరోకసారి తుడిచెయ్యడానికి ప్రయత్నించింది, మరకలు గోడ నిండా అలుముకున్నాయి. తెల్లటి గోడంతా మసితో నిండిపోయింది.

నిస్సహాయతలో దుఃఖం ముంచుకొచ్చింది ముత్యాలుకు. ఎన్నాళ్లక్రితమో మరిచిపోయిన ఏడుపు. ఇన్నాళ్ళూ మనసులోనే జల్లులా వర్షిస్తున్న ఏడుపు, హోరున దూకే జలపాతంలా, వడగండ్లవానలా వెలికి వచ్చింది.

ఎంతోసేపు అలా ఏడుస్తూనే ఉండిపోయింది ముత్యాలు.

* * *

'ముత్తెం...' కళ్లు నులుముకుంటూ లేచి కూర్చున్న రాములు పిలుపునకు జవాబులేదు. అటూ ఇటూ చూశాడు. ఇంట్లో ఎక్కడ కనిపించలేదు.

కారు మబ్బుల్ని చీల్చుకుంటూ సూర్యుడు పగలబడి నవ్వుతున్నాడు. ఆ నవ్వు రేకులు రేకులుగా కిటికీలోనుంచి ఇంట్లోకి ప్రవహిస్తోంది

'ఏడకి పోయినట్టు ఇంత పొద్దున్నే...', అనుకున్నాడు రాములు. అతని దృష్టి అప్రయత్నంగా గోడమీద నిలిచింది.

గోడమీద ఓ తుమ్మెద ఎగురుతోంది. దానిచుట్టూ గుండ్రంగా నల్లటి మరకలు. దాని పక్కగా పువ్వుండాల్సిన చోటులో మరో నల్లటి మరక!

రాత్రి తను చూసిన పురుగులూ, పువ్వూ ఏమయ్యాయో, ఇప్పుడీ తుమ్మెద బొమ్మ ఎక్కడిదో అర్థం కాలేదు రాములుకి.

ఏదో గోల వినవడుతుంటే, దిగ్గునలేచి ఇంటిముందు కొచ్చాడు రాములు. ఎవరో హడావుడిగా పరుగెత్తుతున్నారు. ఒకర్ని ఆపి సంగతేమిటో అడిగాడు.

'ముత్యాలు కాలుజారి బావిలోపడి సచ్చిపోయిందట.'

ఆపైన అతను చెప్పిన మాటలు, రాములు 'ముత్యాలూ' అంటూ అరిచిన గావుకేక కింద దాగిపోయాయి.